క్లుప్తంగా

రేపు హుండీల లెక్కింపు

చిల్పూరు: స్థానిక బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు ఉంటుందన్నారు. లెక్కింపులో పాల్గొనే వారు స్వచ్ఛందంగా హాజరు కావొచ్చని కోరారు.

ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి

చిల్పూరు: త్వరలో జరుగబోయే ఎన్నికల్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం(ఈవీఎం)లపై ఓటర్లు అవగాహన ఉండాలని అందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసే కార్యమాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సరస్వతీ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఈవీఎంలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలా వినియోగించుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. సమావేశంలో సర్పంచ్ రాజ్‌కుమార్, డీటీ విమల, ఆర్ఐ శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ స్లాట్ పత్రాల పంపిణీ



జనగామ: స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్స్ బుకింగ్ పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు 200 మందికి డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ డాక్యుమెంట్లను అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ యూత్ ప్రెసిడెంట్ ఉల్లెంగుల సందీప్, పట్టణ మీడియా ఇన్‌చార్జ్ రొడ్రిక్స్ రాజ్‌కుమార్, మిద్దెపాక లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించండి

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ నుంచి ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్ మీదుగా మాదారం వరకు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సోమవారం జనగామలో ఆర్టీసీ డిపో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. బస్సు సర్వీసులు లేక మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు సానుకూలంగా స్పందించారని సర్పంచ్‌లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సర్పంచ్‌లు రాంరెడ్డి, ఎండీ హయత్ అలీ, విలేజ్ సురేందర్‌గౌడ్, యాదగిరి, శ్రీనివాస్, అశోక్, ఎండీ యాకుబ్ ఉన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చిల్పూరు: జిల్లా విద్యాశాఖ ఆదేశం మేరకు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బయోమెట్రిక్ అప్‌డేట్ చేయడానికి ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆధార్ కో–ఆర్డినేటర్ తేజావత్ మోహన్ కోరారు. మండలంలోని వెంకటాద్రిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని హెచ్‌ఎం కాత్యాయని ప్రారంభించారు. సమావేశంలో ఉపాధ్యాయులు అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు

జనగామ: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్‌నగర్‌లో గతంలో వ్యాధి నిరోధక టీకాలు తీసుకోని పిల్లలను గుర్తించి టీకాలు వేశారు. స్థానిక కౌన్సిలర్ స్వరూప పాల్గొని ప్రారంభించగా వైద్యాధికారి డాక్టర్ తేజ మాట్లాడారు. మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమం ఈ నెల7 నుంచి 12 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సామాజిక అధికారి ఎం.ఎం.రహమాన్, సూపర్‌వైజర్ ఉపేంద్ర, స్టాఫ్‌నర్స్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విస్తరణకు సైనికుల్లా పని చేయాలి



దేవరుప్పుల: బీఆర్ఎస్‌ను దేశవ్యాప్త పార్టీ విస్తరణకోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం దేవరుప్పులకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలను హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కల్పించినట్లు తెలిపారు. కేటీఆర్ కార్యకర్తలకు పార్టీ బలోపేతంతోపాటు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు దయాకర్, సుందర్‌రామిరెడ్డి, హనుమంతు, రాంసింగ్, జనార్దన్‌నాయక్ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

- ఎంపీపీ జ్యోతి, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య



కొడకండ్ల : ర్యాలీని ప్రారంభించిన ఎంపీపీ జ్యోతి

కొడకండ్ల : పుట్టిన బిడ్డకు తల్లిపాలను తాగించినట్లయితే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ఎంపీపీ జ్యోతి, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య అన్నారు. సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి తల్లిపాల వారోత్సవాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ మాతాశిశు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీలు మధుసూదన్, విజయలక్ష్మి, నసీరుద్దీన్, డాక్టర్లు హరికృష్ణ, స్నేహలత పాల్గొన్నారు.

జనగామ రూరల్: పుట్టిన బిడ్డకు ముర్రు పాలే ఆరోగ్యదాయకం అని సర్పంచ్ ఇట్టబోయిన రజిత అన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మరిగడిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అధికారులు గర్భిణులకు, చిన్నారుల, తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: మండలంలోని జఫర్‌గఢ్, వడ్డెగూడెం, హిమ్మత్‌నగర్, ఉప్పుగల్లు తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌లు సువర్ణ అయోధ్య, నర్సింగరావు మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టాలని ముర్రుపాలు శ్రేష్ఠమైనవని ఏసీడీపీఓఈ విక్టోరియా, డాక్టర్ సృజన అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ నాగజ్యోతి హాజరుకాగా మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ అనురాధ, అంబిక, సూపర్‌వైజర్ మనోహర, తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపు తల్లిపాలు పట్టిస్తే.. ఇద్దరి మధ్య అనుబంధం పెరగడంతో పాటు శిశువు సంపూర్ణ ఆరోగ్యతకు దోహదపడుతుందని ఎంపీపీ సావిత్రి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్వర్ ఉన్నీస, సర్పంచ్ బిల్లా అంజ మ్మ, ఎంపీఓ సురేష్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం చేసేందుకు తల్లులు ఖచ్చితంగా వెళ్లాలన్నారు.

వృత్తిదారులకు ప్రభుత్వం పెద్దపీట



జనగామ రూరల్ : గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ కళింగరాజు

జనగామ రూరల్: స్వరాష్ట్రంలో వృత్తిదారులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. సోమవారం మండలంలోని గానుగుపహడ్, ఓబుల్ కేశవాపూర్, అడవికేశవాపూర్, పెద్దరాంచర్ల, శామీర్‌పేట గ్రామాలకు 7 యూనిట్ల గొర్రెలు మంజూరు కాగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్, యాదగిరి, రాజు, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధికి కృషి

తరిగొప్పుల: గొల్ల కురుమల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని సర్పంచ్ దామెర ప్రభుదాస్ అన్నారు. మండల కేంద్రంతో పాటు అక్కరాజుపల్లి, సోలిపూర్ గ్రామాలకు చెందిన నేతుల సత్తయ్య, పురమాని సంపత్, చేవెళ్ల మల్లయ్యకు రెండో విడతలో భాగంగా మంజూరైన గొర్రెల యూనిట్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ప్రియాంక, అక్కరాజుపల్లి సర్పంచ్ అమిరిశెట్టి వీరేందర్, ముద్దసాని వెంకట్‌రెడ్డి, మంద చంద్రయ్య, బూస కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

జనగామ రూరల్: నిత్యం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని నేరాలపై ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అడవికేశాపూర్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా దూరంగా ఉండాలని వాటి వినియోగం వల్ల కలిగే అనార్థాలు ప్రజలకు, యువతకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో నర్మెట సీఐ నాగబాబు, జనగామ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్, ఎస్సైలు సృజన్, అరుణ్, స్వేత, పాల్గొన్నారు.

బోధన సామర్థ్యం పెంచేందుకే ‘తొలిమెట్టు’



మాట్లాడుతున్న రవీందర్‌రావు

చిల్పూరు: కరోనా సమయంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిలో బోధనా సామర్థ్యం పెంచేందుకే తొలిమెట్టు కార్యక్రమం అని నోడల్ అధికారి పుప్పాల రవీందర్‌రావు అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల క్లస్టర్‌లో గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణా తరగతుల్లో సోమవారం విద్యార్థులు వర్క్‌బుక్ ఎలా వినియోగించాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా సమయంలో విద్యార్థులు చదువులో వెనుకబడి పోయారన్నారు. అలాంటి వారిని గుర్తించి వారిలో బోధనా సామర్థ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఆలయ దారి కబ్జాచేసి దళితులపై కేసులా ..?

- రఘునాథపల్లిలో బీజేపీ ధర్నా



రహదారిపై బైఠాయించిన బీజేపీ నాయకులు

రఘునాథపల్లి: స్థానిక మహాదేవస్వామి ఆలయానికి జాతీయ రహదారి నుంచి వెళ్లే దారిని సర్పంచ్ కబ్జా చేసి.. ప్రశ్నించిన దళితులపై కేసులు నమోదు చేయించాడని ఆరోపిస్తూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డు నుంచి ఆలయం వరకు దారి ఉండేదని, సర్పంచ్ కుటుంబ సభ్యులు ఇక్కడ ప్లాట్ కొనుగోలు చేసి దారిని కబ్జా చేశాడని కొన్నాళ్లుగా వివాదం కొనసాగుతోంది. వారం రోజుల క్రితం కొందరు దళితులు ఈ వివాద స్థలం నుంచి ఆలయం వరకు మట్టి రోడ్డు పోశారు. సర్పంచ్ పోకల శివకుమార్ తన కుటుంబ సభ్యులతో నలుగురు దళితులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదైంది. దళితులపై కేసులు నమోదైన విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు సోమవారం రహదారిపై బైఠాయించి సర్పంచ్‌కు వ్యతిరేకంగా బ్యానర్లు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. దళితులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకొని, ఆలయ దారిని గ్రామస్తులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సర్పంచ్ శివకుమార్‌ను వివరణ కోరగా తమ కుటుంబ సభ్యులు ఫ్లాటును కొనుగోలు చేసిన సమయంలో ప్లాట్ పక్కన దారి లేదని, ఈ విషయంలో తమ కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వల్లాల వెంకటేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ద్యావర రాజు, పేర్ని మల్లేష్, కట్ట రాజేష్, స్థానికులు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం జరిగింది. కాజీపేట జీఆర్పీ ఎస్సై సీహెచ్.పరుశరాములు తెలిపిన కథనం ప్రకారం.. రాయపర్తి మండలం తిర్మలాయపల్లికి చెందిన ప్రభాకర్(40)కు భార్య అనిత, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతో తరచూ కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రభాకర్ సోమవారం ఉదయం ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో మద్యంలో క్రిమిసంహారక మందు కలిపి తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రయాణికులు గుర్తించి రైల్వే సిబ్బందికి సమాచారం అందించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. జీఆర్‌పీ పోలీసులు శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాటకు ప్రపంచ కీర్తి తెచ్చిన గద్దర్

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామ : మౌనం పాటిస్తున్న కొమ్మూరి

జనగామ: తెలంగాణ పాటకు ప్రపంచ వ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ ఆకస్మిక మరణం రాష్ట్ర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. గద్దర్ మరణం తెలంగాణ ప్రజలకు తీరనిలోటన్నారు. నాయకులు సుధాకర్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, సిద్దారెడ్డి, దళితరత్న డాక్టర్ రాజ మౌళి, శివరాజ్ యాదవ్, మోటే శ్రీనివాస్, సిద్దిరాములు,నర్సింగరావు, విజయ్‌కుమార్,నర్సిరెడ్డి, స తీష్, శ్రీనివాస్, కనుకస్వామి, వీరభద్ర పాల్గొన్నారు.

తరిగొప్పుల: మండల వ్యాప్తంగా గ్రామాల్లో పలు సంఘాల నాయకులు గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచులు ప్రభుదాస్, వీరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, లింగం, వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, కిష్టయ్య, భీమా నాయక్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : పీడిత వర్గాల పక్షాన వినిపించిన పోరుగొంతుక, ప్రజాయుద్ధనౌక గద్దర్ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా సీనియర్ నాయకుడు ఎండీ.రహ్మతుల్లా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పస్తం పృథ్వీ, చింత జగదీష్ అన్నారు.

ఉద్యమానికి ఊపు తెచ్చిన గద్దర్

తెలంగాణ ఉద్యమానికి ప్రజాయుద్ధనౌక, గాయకుడు తన గళంతో ఊపు తెచ్చారని స్పందన ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొగుదుంపురం కిషోర్‌కుమార్ అన్నారు.

దేవరుప్పుల : జనగామ–సూర్యాపేట ప్రధాన రహదారి చౌరస్తా ప్రజా గాయకుడు యుద్ధనౌక వాగ్గేయకారుడు గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి పలువురు యువత ఘన నివాళులు అర్పించారు. కడవెండిలో గద్దర్ చిత్రపటాలను యోధుల స్మారక విగ్రహాల వద్ద ఏర్పాటు చేసి మైనాల మల్లాజీ, దరగాని పీరోజీ నివాళులు అర్పించారు.

జనగామ రూరల్ : నిత్యం పేదల చైతన్యం కోసం చివరి దాకా తన పాటలతో మేల్కొలిపిన పేదల పక్షపాతి గద్దర్ అని ఎంపీపీ మేకల కళింగ రాజు అన్నారు. సోమవారం మండలంలోని శామీర్‌పేటలో గద్దర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ప్రశాంత్,నర్సింగ్, శంకర్, ఉదయ్,గట్టయ్య, సాలమన్, తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: గద్దర్ మృతి పట్ల మండల కేంద్రంలో గ్రామపంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ బల్లెపు నర్సింగరావు ఆధ్వర్యంలో గద్దర్‌కు సోమవారం ఘనంగా నివాళులర్పించారు.

ఘన్‌పూర్ అభివృద్ధికి సహకరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధికి రాజకీయ పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని స్థానిక సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని 3వ వార్డులో రూ.6 లక్షలు ఎస్ఎఫ్‌సీ నిధుల నుంచి చేపడుతున్న అంతర్గత సీసీరోడ్ల నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సహకారంతో స్టేషన్ ఘన్‌పూర్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, రాజు, ఈఓ సత్యనారాయణ, వార్డు సభ్యురాలు సుజాతసుధాకర్, ఎల్లయ్య, క్రిష్ణ, సతీష్, సాయిరెడ్డి, శ్రీను, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

పోచంపల్లి పట్టుచీరలకు జనగామ కేంద్ర బిందువు



జనగామ : నేత కార్మికులను సత్కరించిన రామిని హరీష్

జనగామ: పోచంపల్లి పట్టుచీరలకు జనగామ కేంద్రబిందువుగా ఉందని టీడీపీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్ అన్నారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వీవర్స్ కాలనీ(12వ వార్డు)లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టుచీరల తయారీకి మరింత ప్రోత్సాహం అందిండచంతోపాటు ముడిసరుకు ను ప్రభుత్వ సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికంగా తయారైన చీరలను సూరత్, భీవండి ప్రాంతాలకు ఎగుమతి చేసేలా కార్యాచరణ రూ పొందించాలన్నారు. ఈ సందర్భంగా నేత కార్మికుల ను శాలువాలతో సత్కరించి వారి సేవలను కొని యాడారు. కార్యక్రమనికి తాళ్లపల్లి ఎల్లేష్, చీకట్ల నవీన్‌గౌడ్, పరకాల శ్రీనివాస్‌గౌడ్, ఎండీ.ఎక్బాల్, గడ్డం కృష్ణ, గుగులోత్ కనకరాజు, గోళ్ల శ్రీనివాస్‌రావు, ఎల్లారెడ్డి, శ్రీధర్, సిరాజ్, మంచాల అరవింద్, వజ్జే పరుశరాములు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగాలి

కొడకండ్ల : పద్మశాలీలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తూ రాజకీయంగా కూడా ఎదుగుతూ చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహించాలని మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు, సర్పంచ్ పసునూరి మధుసూదన్ అన్నారు. సంఘం పట్టణ అధ్యక్షుడు చెన్న ఉపేందర్, ప్రధాన కార్యదర్శి వెంకన్న, మధుసూదన్, మోహన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలపై ఉద్యమించాలి

రఘునాథపల్లి: కేంద్రంలోని బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలపై ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ముప్పిడి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సీపీఐ మండల సమితి సమావేశంలో ప్రజానౌక గద్దర్‌కు నివాళులర్పించారు.

పంచాయతీ కార్మికుడి మృతి

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన పంచాయతీ కార్మికుడు బైరపాక దశరథ (55) సోమవారం అనారోగ్యంతో మరణించాడు. సమాచారం తెలుసుకున్న జేఏసీ నాయకులు, ప్రజా సంఘాలు, ప్రజా ప్రతి నిధులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సీఐని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

చిల్పూరు: రఘునాథపల్లి సీఐగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగా సోమవారం మండలంలోని చిన్నపెండ్యాల బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ సమ్మయ్యగౌడ్, జగన్నాథం, వెంకటేశ్వర్లు, ప్రవీణ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

మణిపూర్‌లో హింసను ఆపాలి

పాలకుర్తి: మణిపూర్‌లోజరుగుతున్న హింసను నిలిపివేయాలని నియోజకవర్గంలో ఫాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఈ.వీ.థామస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఫెలోషిప్ ర్యాలీ నిర్వహించారు.

ధర్నాను విజయవంతం చేయాలి

పాలకుర్తి టౌన్/జఫర్‌గఢ్: ఈ నెల 12న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూఎస్పీ ఆధ్వర్యంలో ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.హేమలత అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

బచ్చన్నపేట: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో బీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జరిగిన సమావేశానికి మండలం నుంచి పద్మశాలి సంఘం నాయకులు తరలివెళ్లారు. మంత్రి కేటీఆర్ పాల్గొనే సమావేశానికి మండలంలోని పలు గ్రామాల నుంచి 120 మంది సభ్యులు రెండు బస్సుల్లో తరలివెళ్లినట్లు గుర్రపు బాలరాజు తెలిపారు.

కేటీఆర్, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం



జనగామ: చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నేత కార్మికులకు సంక్షేమ వర్షాలు కురిపించిన ఐటీ, పురపాలిక, చేనేత జౌళ్లశాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. సోమవారం పట్టణం లోని వీవర్స్ కాలనీలో కౌన్సిలర్ భూలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాగరాజు, గణేష్, జై రాములు, వెంకన్న, శంకర్, శ్రీనివాసు, రామలింగేశ్వర్, సత్యనారాయణ, లింగం, కృష్ణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: టేకేదారులకు జీవనభృతి కల్పించినందుకు దేశాయ్ బ్రదర్స్ లిమిటెడ్ బచ్చన్నపేట బీడీ కంపెనీ టేకేదారుల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి, మార్క భిక్షపతి, శాడగొండ మాధవరెడ్డి, వెంగల్దాస్, ఆంజనేయులు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జఫర్‌గఢ్: కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్యగౌడ్ కోరారు. కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం జెండాను సంఘం అధ్యక్షుడు మేర్గు నర్సింగంగౌడ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మేర్గు ఎల్లగౌడ్, సమ్మయ్య, కొంరెల్లి, సంపత్, చంద్రమౌళి, కుమార్ పాల్గొన్నారు.

పశువుల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి

రఘునాథపల్లి: పశువుల సంరక్షణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇబ్రహీంపూర్‌లో సోమవారం గాలికుంటు, ముద్ద చర్మం వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని స్థానిక సర్పంచ్ దొరగొల్ల ఐలమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు, మందులు వేస్తున్నామన్నారు. వైద్యశిబిరంలో గ్రామంలోని 137 పశువులకు టీకాలు చేశామన్నారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కార్తీక్



జనగామ: భారతీయ జనతా యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఘణపురం కార్తీక్ తేజను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ తేజ మట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నర్మెట: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఉపేక్షించేది లేదని ఎస్సై గైకిడి అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం యువతకు అవగాహన సదస్సులో ఆయన పలు సూచలు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నందున పోలీసులు నిఘా పెంచడం జరిగిందని కులమతాలు, రాజకీయాలపై అనవసరమైన రగడ, పోస్టింగులు సోషల్ మీడియాలో షేర్ చేయరాదన్నారు.

డబుల్‌బెడ్రూం ఇవ్వాలి

దేవరుప్పుల: స్థానిక కస్తూర్భాగాంధీ పాఠశాల వెనుక నిర్మించిన డబుల్‌బెడ్రూంలను అర్హులకు కేటాయించాలని మండల కేంద్రవాసులు ఉప్పుల మహేష్, ఇటుకాల కల్యాణ్, ఉప్పుల అనిల్ కోరారు. సోమవారం జనగామ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

బహిరంగ ప్రకటన

[illegible]

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., LL.B. Advocate
1-2-273, Opp: Court Building, Brundavan Colony, JANGAON, Dist: Jangaon. Cell: 9848430926

బహిరంగ ప్రకటన

[illegible]

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., LL.B. Advocate
1-2-273, Opp: Court Building, Brundavan Colony, JANGAON, Dist: Jangaon. Cell: 9848430926

‘ఆలయంలో ఆభరణాలు ఎత్తుకెళ్లలేదు’

లింగాలఘణపురం: మండలంలోని బండ్లగూడెం బండగుట్ట స్వయంభువుని లక్ష్మినృసింహస్వామి ఆలయంలో తాళాలు పగులగొట్టిన గుర్తుతెలియని దొంగలు బంగారు ఆభరణాలు దొంగిలించలేదని సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గర్భగుడి తాళాలు పగులగొట్టారు. సోమవారం ఉదయం సీఐ, ఎస్సై ప్రవీణ్ క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. క్లూస్ టీం సీఐ రాజశేఖర్‌రెడ్డి వేలిముద్రలు తీసుకున్నారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయంలో తాళాలు పగులగొట్టి దొంగతనం చేసేందుకు ప్రయత్నించినా దొంగలు ఆభరణాలు ఎత్తుకెళ్లలేదని, హుండీలోని డబ్బులు కూడా తీసుకోలేదన్నారు. అయినప్పటికీ విచారణ జరిపిస్తామని చెప్పారు. ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ విజయకుమార్‌ను కోరారు. అదేవిధంగా దుర్గమ్మగుడిలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి హుండీలోని డబ్బులను దోచుకెళ్లారు. ఈ విషయంపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ప్రవీణ్ వివరించారు.